దోమలకు పొగ ఏదీ..?

మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు

- పల్లె, పట్టణాల్లో పేరుకుపోయిన అపరిశుభ్రత
- వేగంగా వృద్ధి చెందుతున్న దోమలు
- వానాకాలంలో పొంచి ఉన్న రోగాల ముప్పు
- నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న అధికార యంత్రాంగం



వర్షంవస్తే చాలు రొద్దం వైఎస్ఆర్ సర్కిల్ ప్రధాన రహదారిలో ఇలా ఉంటుంది..

పుట్టపర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వానా కాలం మొదలైంది. నేల చిత్తడికి తోడు అపరిశుభ్రత ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రజలకు రోగాల ముప్పు తప్పడం లేదు. ఈ వర్షాకాలం రాకతో డెంగీ, మలేరియాతోపాటు సీజనల్ వ్యాధులు వెలుగుచూస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఏటా పన్నుల రూపేనా ప్రజల నుంచి డబ్బు దండుకున్నా పురపాలిక, నగర గ్రామ పంచాయతీల్లో ఆస్థాయిలో ప్రజారోగ్యంపై దృష్టి సారించలేదు. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయినా తొలగించే కార్యక్రమాలు చేపట్టలేదు. దీంతో దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియాతోపాటు సీజన్ వ్యాధులు వ్యాపింపజేస్తు న్నాయి. దోమల నివారణకు ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, పంచాయతీలకు సరఫరా చేసిన ఫాగింగ్ యంత్రాలు మూడేళ్లుగా మూల కు చేరాయి. వాటిని ఎలా వినియోగించాలనే దానిపై సిబ్బందికి అవ గాహనలేదు. ఇక పురపాలక, నగర పంచాయతీల్లో మాత్రం వాటిని వినియోగిస్తున్నట్లు లెక్కలైతే చూపుతున్నారు. ఎంత మాత్రం వాడుతున్నారనేది అక్కడి ప్రజలకే తెలియాలి.

పంచాయతీలకు పెనుభారం

దోమల నివారణకు మూడేళ్ల కిందట పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. చాలా పంచాయతీలకు చేరలేదని సర్పంచులు చెబుతున్నారు. పంచాయతీల్లో ఫాగింగ్ యంత్ర వినియోగం భారంగా మారింది. ఒక ఫాగింగ్ యంత్రంలో అయిదు లీటర్ల డీజిల్, ఒక లీటర్ పెట్రోల్ పోయాలి. ఇందుకు రూ.600పైగా ఖర్చు అవుతుంది. అయిదు లీటర్ల డీజల్ ఒక గంట దాకా వస్తుంది. మేజర్ పంచాయతీల్లో ఒకటికి రెండు వీధులకు సరిపోతుంది. పారిశుధ్య నిర్వహణకే నిధులు లేక అల్లాడుతున్న పంచాయతీలకు ఫాగింగ్ యంత్ర వినియోగం అదనపు భారం కానుంది. దీంతో చాలా పంచాయతీల్లో మూలన పెట్టేశారు.

ఫాగింగ్‌కు.. 'పొగ'బెట్టారు

చాలా పంచాయతీల్లో రెండేళ్లుగా పారిశుధ్య నిర్వహణ పూర్తిగా పడకేసింది. చెత్త చెదారం పేరుకుపోవడంతో దోమలు ఉధృతి పెరిగింది. కొవిడ్ తరువాత దోమల మందు పిచికారీ చేసిన దాఖలాలే లేవు. ఫాగింగ్ యంత్రాన్ని గదిలో పెట్టి తాళాలు వేశారు. గత ఏడాది ఫాగింగ్ యంత్రాలను వినియోగించామని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నా క్షేత్రస్థాయి లో పరిశీలిస్తే అదంతా ఉత్తదే అని తేలుతోంది. ఇక గ్రామ పంచాయతీల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లే పరిస్థితి కూడా లేకుండా పోయింది. దీంతో దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామని పలు పంచాయతీ ల్లోని ప్రజలు వాపోతున్నారు.

కానరాని ప్రత్యేక కార్యక్రమాలు

2014-19 మధ్య కాలంలో పురపాలక సంఘాల్లో దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే నిర్వహించేవారు. దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకునేవారు. వైసీపీ పాలనలో ఇలాంటివి కనిపించలేదు. కనీసం క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంది. సీజనల్ వ్యాధులు నమోదైన చోట ఏం చేయాలి. భవిష్యత్తు కార్యాచరణ ఏమిటి అనే ఆలోచన లేకుండాపోయింది. దీంతో దోమలు బాగా వృద్ధి చెంది జనానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

పట్టించుకోని ప్రజారోగ్య వ్యవస్థ

జిల్లాలోని పురపాలికల్లో ప్రజారోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దోమల నివారణ పేరుతో నిధులు పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో హిందూపురం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి పురపాలికల్లో లక్షలు ఖర్చు చేస్తున్నారు. నగర పంచాయతీల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఫాగింగ్ యంత్రాలు వినియోగిస్తున్నట్లు లెక్కలు చూపిస్తున్నా వాటికి పని చెప్పక చాలా వాటిని మూలన పడేశారు. చాలా పురపాలికల్లో నాసిరకం బ్లీచింగ్, మలాథియన్ ద్రావణం తెప్పించి అధిక మొత్తంలో బిల్లులు చేసి సొమ్ము స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫాగింగ్ పేరుతో తిప్పే వాహనాలకు ఇంధనం కోసం బోగస్ బిల్లులు తయారుచేసి అక్రమాలకు పాల్పతున్న సంఘటనలున్నాయి.



వెంటతిమ్మాపురంలో రోడ్లపై పారుతున్న మురుగునీరు



కొత్తచెరువులో మరవ ఆంజనేయ స్వామి ఆయలం వీధిలో ఇలా ...



గాండ్లపెంట మండలం వేపరాల సచివాలయంలో మూలన పడేసిన ఫాగింగ్ యంత్రాలు



మురిపిస్తున్న మిరప

తనకల్లు, జూన్ 8: మండల రైతులు మిరప సాగు వైపు మళ్లుతున్నారు. మిరప సాగుచేసిన రైతులు లాభాలు కళ్ల చూస్తుండ టంతో మిగిలిన వారు కూడా ఆ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. వివిధ గ్రామాల్లో ఇప్పటికే వంద ఎకరాలకు పైగా మిరప పంటను సాగుచేశారు. మిరప కాయలను కొనుగోలు చేయడానికి వ్యాపారులు నేరుగా తోటల వద్దకే వచ్చి ఖచ్చితమైన తూకాలు వేసుకుని, వెళ్తుండ టంతో రైతులు మిరప వైపు దృష్టి మళ్లిస్తున్నారు.

ఒక్కో కోతకు ఎకరానికి నాలుగు టన్నుల దిగుబడి

ఒక కోతకు ఎకరాకు మూడు నుంచి నాలుగు టన్నుల దాకా దిగుబడి వస్తున్నట్లు రైతులు చెప్పారు. కోతకు రూ. రెండు లక్షలకు పైగా ఆదాయం వస్తున్నట్లు తెలిపారు. ఈప్రాంతంలో మిరపకు పెద్దగా చీడపీడలు రాకపోవడంతో లాభసాటిగా ఉంటోందని పలువురు రైతులు పేర్కొన్నారు. ఇప్పడి వరకు ముడుగు వ్యాధి మాత్రమే సోకుతోందన్నారు. ఈవ్యాధి నివారణకు మందులు వాడితో సరిపోతున్నట్లు పేర్కొన్నారు. 90 నుంచి వందరోజులకు కోతకు వచ్చే మిరప మూడునెలలపాటు దిగుబడి ఇస్తుందన్నారు. మొదట ఎక్కువ దిగుబడి వచ్చినా తోటను కాపాడుకోవడాన్ని బట్టి తర్వాత కూడా దిగుబడి బాగానే ఉంటుందని రైతులంటున్నారు. మందుల పిచికారి, ఎరువులు, కూలీలు, ఖర్చులన్నీ పోనూ ఎకరాకు రూ.4లక్షలు నికర ఆదాయం వస్తున్నట్లు చెప్పారు.

నర్సరీల్లో నారు పెంచి...

మిరప సాగుచేయడానికి విత్తనాలను అనంతపురం నుంచి తెప్పిస్తున్నారు. కిలో రూ.75వేలు పెట్టి ఆసిత్ -1 రకాన్ని కొనుగోలు చేస్తున్నారు. తెచ్చిన విత్తనాన్ని నర్సరీల్లో నారుగా పెంచుతున్నారు. అనంతరం దాన్ని పొలాల్లో నాటుకుంటున్నారు. మండలంలోని కొర్తికోట, మంగదిన్నెపల్లి, తుమ్మలవారిపల్లి గ్రామాల్లోనే 50 ఎకరాలకు పైగా మిరప సాగుచేశారు. ఈఏడాది మిరప సాగుచేసిన రైతులకు లాటరీ వచ్చినట్లే అని పలువురు రైతు మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం కిలో రూ. 60 ధర పలుకుతోంది. వ్యాపారులు తోటల వద్దకే వచ్చి పంట కొనుగోలు చేస్తుండటం మిరప రైతులకు బాగా కలిసివస్తోంది.

ఏడాదిలో మిరప ఒకటే సాగుచేస్తా



ఏడాదిలో మిరప ఒకటే సాగుచేస్తా. టమాటాలు సాగుచేసి పూర్తిగా నష్టపోయా. ప్రస్తుతం టమాట సాగు వదిలేశా. ఎకరానికి రూ.లక్ష నుంచి 1.5లక్షల దాకా ఖర్చు అవుతోంది. ఆదాయం మాత్రం రూ. ఏడు లక్షల నుంచి ఎనిమిది లక్షల దాకా వస్తోంది. తుమ్మలవారిపల్లి వద్ద సాగు చేసిన రమణ అనే రైతు స్ఫూర్తితో మేము కూడా మిరప సాగు చేస్తున్నాం. మా గ్రామంలో తొలుత ఇద్దరు మాత్రమే మిరప సాగు చేసేవారు. పంట లాభాదాయంగా ఉండటంతో ప్రస్తుతం పదిమంది దాకా సాగుచేస్తున్నాం. పంట మార్పిడి విధానంలో ఈఏడాది సాగు చేసిన భూమిలో కాకుండా మరో భూమిలో మిరప సాగుచేస్తున్నాం.

- వెంకటాద్రినాయుడు, మంగదిన్నెపల్లి

మెలకువలు పాటిస్తే లాభమే



మిరప సాగులో రైతులు మేలకువలు పాటిస్తే మంచి ఆదాయం వస్తుంది. మాది అన్నమయ్య జిల్లా. కొర్తికోట వద్ద భూములు లీజుకు తీసుకుని, మిరప పంటను సాగుచేస్తున్నా. మిరప అమ్ముకోవడానికి మార్కెట్‌కు తరలించాల్సిన అవసరం లేదు. అనంతపురం నుంచి వ్యాపారులు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఖచ్చితమైన ధరలు, తూకాలతో తీసుకెళ్తున్నారు. ఎకరానికి రూ.నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల దాకా ఆదాయం ఉంటుంది. ఈప్రాంతంలో మొదట మిరపను సాగుచేసి, పరిచయం చేసింది మా కుటుంబమే.

- రమణ, కొర్తికోట

సంపూర్ణావతారి సత్యసాయి



పుట్టపర్తి, జూన్ 8: భగవాన్ సత్యసాయిబాబా సంపూర్ణావతారి అని, ఆ అవతారం ద్వారా ప్రేమతత్వాన్ని, ఆధ్యాత్మకతను పంచారంటూ బాలవికాస్ చిన్నారులు సంగీత నృత్యం ద్వారా చాటిచెప్పారు. ఉమ్మడి అనంతపురం జిల్లాల్లోని ఉన్న 2500 మంది సత్యసాయి సేవా సంస్థల సభ్యులు పర్తియాత్ర పేరిట శనివారం పట్టణంలోని ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. అక్కడ సాయంత్రం సాయికుల్వంత్ హాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మొదట సత్యసాయి సహస్ర నామావళి పేరిట భక్తిగీతాల ఆలాపన చేశారు. తర్వాత బాలవికాస్ చిన్నారుల చేత సంపూర్ణ అవతారి సత్యసాయి పేరిట సంగీత నృత్యరూపకాన్ని చేపట్టారు. గంటపాటు జరిగిన ఈ కార్యక్రమం భక్తులను అలరించింది. తర్వాత సత్యసాయి మహాసమాధిని దర్శించారు.



← పాటలు పాడుతున్న భక్తులు.. నృత్యం చేస్తున్న బాలవికాస్ చిన్నారులు.. →

అన్నీ పాయే..!

- బెట్టింగ్‌లతో రూ.కోట్లు కోల్పోయిన వైసీపీ అభిమానులు
- డబ్బు, అధికారం రెండూ దూరం
- అయోమయంలో కార్యకర్తలు

కదిరి: ఎన్నికలు ముగిశాయి..టీడీపీ ప్రభంజనంతో వైసీపీ నేతలు ఓటమి చెందారు. పార్టీ అభ్యర్థి తట్టా, బుట్టా సర్దుకుని పోయారు. నియోజకవర్గంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు మాత్రం దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. పార్టీ గెలుస్తుందని రూ.లక్షల్లో పందెలు కాసి, డబ్బు పోగొట్టుకున్న నాయకులు లబోదిబోమంటున్నారు డబ్బుతోపాటు ఇన్నాళ్లు ఉన్న అధికారం పోగొట్టుకున్నారు. ఒకే సారి డబ్బూ, అధికారం కోల్పోవడంతో పార్టీ నాయకుల్లో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. దీంతో వైసీపీ నాయకులు అంతర్మథనంలో పడిపోయారు. కొంతమంది బయటకు రాలేక ఫోన్లు స్విచ్ఆఫ్ చేస్తే, మరికొంతమంది వేరే ప్రాంతాలకు తరలివెళ్లినట్లు సమాచారం. భవిష్యత్తులో తమ పరిస్థితి ఏంటని వారిలో ఆందోళన నెలకొంది. అండగా ఉంటారనుకున్న అభ్యర్థికూడా తాను లేకున్నా ఆఫీసు తెరిచే ఉంటుందని, ఏదైనా సమస్య ఉంటే సంప్రదించవచ్చని ప్రకటించడం వారిలో మరింత ఆందోళన కలిగిస్తోంది. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని కొంతమంది కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది నాయకులు ఒత్తిడి తట్టుకోలేక టీడీపీలోకి చేరాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.



బెట్టింగ్‌లతో రూ. కోట్లు నష్టపోయారు

వైసీపీ తిరిగి అధికారం చేపడుతుందని, కదిరిలో మక్బూల్ ఎమ్మెల్యేగా గెలుస్తారని వైసీపీ నాయకులు రూ. కోట్లలో బెట్టింగ్‌లు వేశారు. నల్లచెరువుకు చెందిన ఓనాయకుడు దాదాపు రూ. కోటి 75లక్షల వరకు పందెం కాసి నష్టపోయినట్లు సమాచారం. అయితే అతనికి ప్రభుత్వం నుంచి రూ. మూడుకోట్లు వస్తుందన్న ఆశతో పందెం వేసినట్లు సమాచారం. ప్రభుత్వం మారడం, అది రాదని తేలిపోవడంతో ఆందోళనకు గురవుతున్నట్లు తెలిసింది. పట్టణానికి చెందిన ఓ వ్యాపారి కూడా రూ. 10లక్షలు బెట్టింగ్ వేసి, ఓడిపోయినట్లు తెలిసింది. మరో నాయకుడు రూ.5లక్షలు... ఇలా పలువురు నాయకులు లక్షల్లో పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు. గాండ్లపెంట మండలంలో ఓ ఎరువుల వ్యాపారి రూ.20లక్షలు పందెం కాసి ఓడినట్లు సమాచారం. వైసీపీలో ముఖ్య నాయకుడు రూ.ఐదులక్షలు ఓడినట్లు తెలుస్తోంది. వీరే కాకుండా మరికొంతమంది బెట్టింగ్‌లో వైసీపీని నమ్మి పూర్తిగా నష్టపోయినట్లు సమాచారం. ఎన్పీకుంటలో ఓనాయకుడు బెట్టింగ్ వేసి భారీగా నష్టపోయినట్లు తెలుస్తోంది. పార్టీ గెలుస్తుందని, అత్యంత నమ్మకంతో వేస్తే నాశనం చేశారని, పార్టీ నాయకులపై విరుచుకుపడినట్లు సమాచారం. తనకల్లులో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. అయితే కొంతమంది తెలివిగా ప్రభుత్వం రాదని, కందికుంట గెలుస్తారని బెట్టింగ్ వేశారు. మరికొంతమంది ఎన్‌డీఏ ప్రభుత్వం వస్తుందని, కందికుంట ఓడిపోతారని, ఇలా రెండు రకరాలుగా పందెలు వేశారు. కొంత వరకు వారు సొమ్ము రాబట్టుకున్నారని సమాచారం. మొత్తం మీద వైసీపీని నమ్మి బెట్టింగ్ వేసినవారు నట్టేట మునిగామని ఎన్నికల ఫలితాల తరువాత చెప్పకోవడం చర్చనీయాంశమైంది.

అధికారమూ పోయింది..

నియోజవర్గంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఐదేళ్లుగా అధికారంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఉన్నఫళంగా అధికారం పోయి వాళ్ల వైపు చూసేవారే కరువయ్యారు. కీలక నేతలు అధికారం పోయి అయోమయంలో పడిపోయారు. కొంతమంది నాయకులు ఇటీవల వైసీపీలో ఓడిన అభ్యర్థి సమావేశానికి సైతం హాజరు కాలేదు. మరికొంతమంది వారికి వారే ధైర్యం చెప్పకుంటూ సోషల్ మీడియాలో బుజ్జగిజ్జుకుంటున్నారు. కొంతమంది ఒత్తిడి తట్టులేక తాము టీడీపీలోకి చేరిపోతామని, అధికారం లేకపోతే ఒక్కరోజుకూడా ఉండలేని పరిస్థితి అని బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. ఎమ్మెల్యే కందికుంటకు అధికారం వచ్చిన తరువాత నియోజకవర్గంలో తమ ఆటలు సాగేపరిస్థితి లేదని, కొంతమంది ఫోన్లు స్విచ్చాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం.

రియల్ వెంచర్లకు అక్రమంగా మట్టి

గుట్టలను తవ్వేస్తున్నా పట్టించుకోని అధికారులు



వెలిచెలమల రహదారిలో ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వుతున్న దృశ్యం

గాండ్లపెంట, జూన్ 8: రియల్టర్ల భూములకు ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారుల అండతో ఈ తతంగం నడుస్తోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కురమామిడి పంచాయతీ రెక్కమాను గ్రామంలో వెలిచెలమల ప్రధాన రహదారికి అనుకుని ఉన్న గుట్టను రియల్టర్లు తవ్వేస్తున్నారు. మూడు రోజుల నుంచి మట్టిని తవ్వుతూ.. ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. రెక్కమాను సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద భూమిని చదును చేసేందుకు ఈ మట్టిని వాడుతున్నారని సమాచారం. వీఆర్వో వెళ్లి పరిశీలించారని, కానీ రియల్టర్ల అక్రమాలపై నోరు మెదపలేదని విమర్శలు వస్తున్నాయి. అధికారుల అండతో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోందని, వందలాది టిప్పర్ల మట్టిని అనుమతి లేకుండా తరలిస్తున్నారని స్థానికులు అంటున్నారు. మట్టి తవ్వకాలకు అనుమతులు లేవని, అక్రమంగా తవ్వితే చర్యలు తీసుకుంటామని వీఆర్వో హబీబ్ అన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములు, గుట్టలను రియల్టర్లు మట్టి కోసం వినియోగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అసైన్డ్ భూముల నుంచి కూడా మట్టిని తరలిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

వైసీపీ నాయకుడి తోటకు తాగునీరు



వైసీపీ నాయకుడి తోటవద్దకు పైపులైన్ వేసిన దృశ్యం

గాండ్లపెంట, జూన్ 8: గాజువారిపల్లి పంచాయతీ కల్లుబాయి తండాలో వైసీపీ నాయకుడి తోటలోని ఇంటికి ఎంపీటీసీ నిధులతో తాగునీటి కనెక్షన్ ఇచ్చారని గ్రామస్థులు విమర్శించారు. పంచాయతీ బోరు నుంచి ఎంపీటీసీ నిధులు రూ.70 వేలతో పైపులైన్ వేసి, తోటవద్దకు శనివారం నీటిని మళ్లించారని వారు తెలిపారు. దీంతో తండాలో తాగునీటి సమస్య తలెత్తుతుందని అన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తండాకు వెళ్లి పరిశీలించారు. ఇంటి వద్దకు చిన్న పైపు లైన్ వేయాలని, కానీ ఏకంగా రెండు ఇంచుల పైపులైన్‌తో తోటకు నీటిని మళ్లించడం ఏమిటని కార్యదర్శి అంజినాయక్ ప్రశ్నించారు. అయితే, పైపులైన్ ఏర్పాటు కోసం ఎంపీడీఓ వద్ద అనుమతి పత్రం తీసుకున్నానని వైసీపీ నాయకుడు అన్నారు. ఎంపీడీఓ రామానాయక్‌ను వివరణ కోరగా, పైపులైన్‌కు అనుమతి ఇచ్చామని, అయితే తోటవద్దకు ఇవ్వలేదని, వెంటనే తొలగిస్తామని అన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి


పుట్టపర్తిలో రామోజీరావు చిత్రపటం వద్ద టీడీపీ నాయకుల నివాళి


కదిరిలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా..


కదిరిలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద..


కొత్తచెరువులో..

పుట్టపర్తి, జూన్ 8: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి ఘన నివాళులర్పించారు. విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన రామోజీరావు చిత్రపటానికి పల్లె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మీడియా, సినీ, వ్యాపార రంగాల్లో ఆయన సేవలు మరువలేనివన్నారు. అలాగే ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి రామోజీరావు మృతి పట్ల ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి నివాళి అర్పిస్తున్నట్లు చెప్పారు.

● పుట్టపర్తిలోని టీడీపీ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సామకోటి ఆదినారాయణ, శ్రీరామిరెడ్డి, దేవానంద తదితరులు పాల్గొన్నారు. అలాగే సాయిఆరామంలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు నివాళులర్పించారు.

కదిరి/కదిరి అర్బన్: రామోజీరావు మృతికి పట్టణంలోని టీడీపీ నాయకులు, పాత్రికేయులు, ఉద్యోగులు ఘన నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు డైమండ్ ఇర్ఫాన్, రాజశేఖర్‌బాబు, ఉద్యోగ సంఘం నాయకులు ఆనంద్‌బాబు, సోమశేఖర్, శ్రీనివాసులు, చలపతి ఉన్నారు. అలాగే ఆర్ అండ్‌బీ బంగ్లాలో రామోజీరావు చిత్రపటానికి మహాజన జర్నలిస్టు ఫెడరేషన్ సభ్యులు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి, టీడీపీ నాయకులు, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు, మాదిగ ఉద్యోగుల సంఘం నాయకుడు జర్నలిస్టు ఫెడరేషన్ నాయకులు , జర్నలిస్టులు పాల్గొన్నారు. రామోజీరావు మృతికి సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.


విజయవాడలో రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

ధర్మవరంరూరల్: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, పలువురు టీడీపీ సీనియర్ నాయకులు కలిసి నివాళులర్పించారు. ఆయన సేవల్ని కొనియాడారు.

బత్తలపల్లి: మండలకేంద్రంలోని టీడీపీ కార్యలయంలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గంటాపురం జగ్గు తన నివాసంలో రామోజీరావు చిత్రపటం ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండలకేంద్రంలోని నాలుగురోడ్ల కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద రామోజీరావు చిత్ర పటానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ శ్రేణులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, సీపీఐ మండల కార్యదర్శి చల్లాశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: మండలకేంద్రంలో టీఎస్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ముంటిమడుగు హర్ష, బీజేపీ ధర్మవరం అసెంబ్లీ కన్వీనర్ గంగులకుంట గోపాల్‌రెడ్డి తదితరులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ శ్రేణులు ఘన నివాళులర్పించారు.


ముదిగుబ్బలో..


తాడిమర్రిలో..


బత్తలపల్లిలో..


ధర్మవరం టీడీపీ కార్యాలయంలో..

10న సర్వసభ్య సమావేశం

ఓబుళదేవరచెరువు, జూన్ 8: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 10వ తేదీ ఉదయం 11గంటలకు ఎంపీపీ తుమ్మల ఫర్వీన్ షామీర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అన్నిశాఖలపై సమీక్ష జరపనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక పాల్గొనాలని కోరారు.

16న వీరబ్రహేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఓబుళదేవరచెరువు, జూన్ 8: మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 16వ తేదీన పోతులూరి వీరబ్రహేంద్రస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులనాయుడు శనివారం తెలిపారు. విగ్రహదాత జమేదార్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


శ్రీనివాసులు నాయక్

గాండ్లపెంట, జూన్ 8: మండలంలోని కురమామిడి పంచాయతీ పచ్చార్లమేకల తండాకు చెందిన శ్రీనివాసులునాయక్ అదృశ్యంపై శనివారం కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. మతిస్థిమితం సరిగి లేని శ్రీనివాసులు నాయక్ నెలరోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయారన్నారు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు గాలిస్తున్నా ఆ చూకీ తెలియడం లేదన్నారు. దీంతో అతడి కుమారుడు మహేష్‌నాయక్ ఫిర్యాదు చేశారని, ఆ మేరకు కేసు నమోదు చేసుకుని, విచారణ చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

గ్రంథాలయ చైర్‌పర్సన్ రాజీనామా

అనంతపురం విద్య, జూన్ 8: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పదవికి ఎల్ఎం ఉమాదేవి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు స్టేట్ గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌కు తన రాజీనామా పత్రాన్ని పంపారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో దుర్మరణం

గార్లదిన్నె, జూన్ 8: మండల పరిధిలోని కల్లూరు అగ్రహారం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్ఓ అమర్నాథ్ (36) దుర్మరణం చెందారు. గార్లదిన్నె మండలం కమలాపురం గ్రామానికి చెందిన అమర్నాథ్ పామిడి మండలం కత్రిమల వీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం పనినిమిత్తం ద్విచక్ర వాహనంలో పామిడికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా కల్లూరు అగ్రహారం వద్ద బొలెరో ఢీకొంది. ప్రమాదంలో వీఆర్ఓ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మహమ్మద్‌గౌస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో పాము

శింగనమల, జూన్ 8: శింగనమల పోలీసు స్టేషన్‌లో పాము హల్‌చల్ చేసింది. శనివారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌లోకి పాము దూరడంతో పోలీసులు ఒకసారిగా భయాందోళనకు గురయ్యారు. స్నేక్‌క్యాచర్ రాజుకు సమాచారం అందించడంతో ఆయన పామును పట్టుకుని నిర్మానుష్యప్రాంతంలో వదిలిపెట్టారు.


పామును పట్టుకున్న రాజు

కుమ్మరవాండ్లపల్లిలో పారిశుధ్యం అధ్వానం

● రోడ్లపై పేరుకుపోయిన చెత్త ● డ్రైనేజీల్లో నిలిచిపోయిన మురుగునీరు ● అసౌకర్యానికి గురవుతున్న గ్రామస్థులు


గ్రామంలోని రోడ్డుపై పేరుకుపోయిన చెత్త


డ్రైనేజీ కాలువలో నిలిచిపోయిన మురుగు

కదిరిఅర్బన్, జూన్ 8: మండలంలోని మేజర్ పంచాయతీ అయిన కుమ్మరవాండ్లపల్లిలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. గ్రామంలోని ప్రతి వీధిలోని రోడ్లపై, డ్రైనేజీ కాలువల్లో చెత్త విపరీతంగా పేరుకుపోతోంది. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామంలో చెత్తకుండీలు లేవు. దీంతో పలువురు ఇళ్లలోని చెత్తను తెచ్చి రోడ్డుపైనే పడేస్తున్నారు. వాటిని తొలగించేవారు కూడా లేరు. ఫలితంగా అదంతా పేరుకుపోయింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆ చెత్త నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, అంతేకాకుండా దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, ఫలితంగా రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోవడం వల్ల మురుగునీరు ముందుకెళ్లలేక అక్కడే నిల్వ ఉంటోందంటున్నారు. సమస్య తెలిసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకోండి

● ప్రజలకు ఎస్పీ మాధవరెడ్డి సూచన

రామగిరి, జూన్ 8: గ్రామాలను ఐకమత్యంతో అభివృద్ధి చేసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం సాయంత్రం ఆయన మండలంలోని కుంటిమద్ది, పోలేపల్లి గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి గొడవలు చేసుకోరాదని ప్రజాశాంతికి భంగం కలిగించరాదని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసంచేయడం వంటివి చేస్తే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో గొడవలకు దిగకుండా ప్రశాంతంగా జీవించాలని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని ప్యాదిండి గ్రామాన్ని సందర్శించి గ్రామసభ నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటుచేయడంతోపాటు మొబైల్ పార్టీలు గస్తీ తిరుగుతున్నాయన్నారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిందని, గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ శ్రీవిష్ణు, సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వేంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ ఎస్పీ వెంట ఉన్నారు.


కుంటిమద్దిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ

వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ, జూన్8: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల అనంతరం భక్తులు దాసంగాలు నిర్వహించడం ఆనవాయితీ. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు.


అలంకరణలో మూలవిరాట్


నల్లమాడ పంచాయతీ కార్యాలయంలో వృథాగా ఉన్న పరికరాలు

వృథాగా చెత్త సేకరణ పరికరాలు

● పంచాయతీ కార్యాలయంలో తుప్పు పడుతున్న వైనం

నల్లమాడ, జూన్ 8: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో చెత్తను సేకరించే పరికరాలు, యంత్రాలు మూలనపడి తుప్పు పడుతున్నాయి. గతంలో చెత్తతో సంపద సృష్టించే కేంద్రాలకు చెత్తను సేకరించేందుకు గాను ట్రాక్టర్‌తో పాటు రిక్షాలు తదితర పరికరాలు వాడేవారు. అయితే కొన్నేళ్లుగా చెత్తతో సంపద సృష్టించే కేంద్రాలు ఉపయోగంలో లేవని, దీంతో వాటి పరికరాలు మొత్తం వృథాగా ఉండి తుప్పు పడుతున్నాయని ప్రజలు అంటున్నారు. పంచాయతీ కార్యాలయంలో ఓ మూలకు చెల్లచెదురుగా దర్శనమిస్తున్నాయని వాపోతున్నారు. దీంతో ప్రజాధనం వృథా అయిందని చర్చించుకుంటున్నారు. అధికారులు స్పందించి పరికరాలు ఉపయోగంలోకి తేవాలని వారు కోరుతున్నారు.

మడుగును తలపిస్తున్న రోడ్డు

నల్లమాడ, జూన్ 8: మండలంలోని చౌటకుంటపల్లిలో గల మలకవేమల- ఓడీసీ ప్రధాన రహదారి చిరుజల్లులకే మడుగును తలపిస్తోందని గ్రామస్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. రోడ్డులో వర్షపునీరు పెద్దఎత్తున నిల్వ ఉంటోంది. దీంతో రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలాఉండగా.. రహదారికి సమీపంలోని ఇళ్లలోకి వాహనాలు వెళ్లే సమయంలో నీళ్లు ఎగిసిపడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు తగ్గు ఉండడం, నీరు వెళ్లేందుకు దారి లేకపోవడంతో నిల్వ ఉంటున్నాయని, చెబుతున్నారు. సంబంధికారులు నీరు నిలువలేకుండా చూడాల్సిన అవసరముందని వారు కోరుతున్నారు.


నీటి మడుగులా ఉన్న ప్రధాన రహదారి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి పల్లె శుభాకాంక్షలు

పుట్టపర్తి, జూన్ 8: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఈ శనివారం ఆయన అచ్చెన్నాయుడును కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి తిరుగులేని మెజారిటీ సాధించిందన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మీ కృషి ప్రశంసనీయమని కొనియాడారు.


అచ్చెన్నాయుడికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి పల్లె

మోదీపాలనతోనే దేశం సురక్షితం

కదిరిఅర్బన్, జూన్ 8: నరేంద్ర మోదీ మూడోసారి భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం పార్టీశ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీపాలనతోనే దేశం సురక్షితంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పీటీ ఆంజనేయులు, ఉత్తమరెడ్డి, వెంకటేష్, సుదర్శన్, డీఎల్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న బిజెపీ నాయకులు

మొక్కు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు

గాండ్లపెంట, జూన్ 8: కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకట ప్రసాద్ విజయం సాధించడంతో మండలంలోని టీడీపీ నాయకులు మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ క్రమంలో గాజులవారిపల్లి పెద్దతండా పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు శనివారం కడపజిల్లా గండి ఆంజనేయస్వామి క్షేత్రానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడ ఆంజనేయస్వామికి టెంకాయలు సమర్పించి, ప్రత్యేకపూజలు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ కృష్ణనాయక్, నాయకులు వెంకటరమణనాయక్, రామాంజినాయక్, రామ్లానాయక్, సుధాకర్‌నాయక్, శ్రీకాంత్, రామక్రిష్ణ, గంగరాజు, బాహూజీ, రామచంద్ర ఉన్నారు.


గండి ఆంజనేయస్వామిక్షేత్రంలో టీడీపీ శ్రేణులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కదిరిఅర్బన్, జూన్ 8: పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2004వ సంవత్సరంలో బీకాం చదివిన విద్యార్థులందరూ శనివారం గెట్‌టూగెదర్ నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తరువాత వారందరూ అదే కళాశాలలో కలిసి ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి అధ్యాపకుడు రామచంద్రారెడ్డిని పూలమాలలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మస్తాన్‌వలి, సుస్మిత, మస్తాన్‌వలీఖాన్, ఫిరోజ్‌ఖాన్, పద్మ, అనసూయదేవి, ఫాజిల్, సురేష్, రామంజనేయులు, పరమేశ్వర్‌రెడ్డి, నీలావతి తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో పూర్వవిద్యార్థులు

అదుపు తప్పి లారీ బోల్తా

తాడిమర్రి, జూన్ 8: ధర్మవరం వైపు నుంచి తాడిపత్రి వైపునకు ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీ మండలంలోని ఏకపాదం పల్లి వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. వివరాల్లోకెళ్తే.. ఐరన్ లోడుతో వెళ్తున్న లారీ ఏకపాదం పల్లి వద్ద గల మలుపులో ఎదురుగా వస్తున్న వస్తున్న బస్సును తప్పించబోయి అదుపు తప్పి రోడ్డున పక్కన బోల్తాపడింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈమలుపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. వాటి నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టిన పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డు పక్కన బోల్తాపడిన లారీ

సత్యకుమార్ గెలుపుపై పూజలు

ధర్మవరం, జూన్ 8: ధర్మవరం ఎమ్మెల్యేగా సత్యకుమార్‌యాదవ్ విజయం సాధించడంపై పట్టణంలోని కూటమి శ్రేణులు స్థానిక కొత్తపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయంలో తొలుత సత్యకుమార్ పేరిట అర్చనలు చేయించారు. తర్వాత స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు పరిశేసుధాకర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జింకాచంద్రశేఖర్, నాయకులు సాకే ఓబులేశు, శీలామూర్తి, బోయరవిచంద్ర, మాదన సుబ్బయ్య, కొత్తపూట ఆది, జింకలరాజన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకుడు గిర్రాజునగేశ్ తదితరులు అంజుమన్ సర్కిల్లోని బొడ్రాయికి 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 15వ వార్డులో ప్రజలకు మిఠాయిలను పంపిణీ చేశారు.


వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూటమి శ్రేణుల పూజలు

తిరుమలకు పాదయాత్ర

తనకల్లు: సత్యకుమార్‌యాదవ్ విజయం సాధించినందుకు మండలంలోని కొక్కంటి క్రాస్‌కు చెందిన సత్యన్నసేన సభ్యులు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. సత్యకుమార్ ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే తిరుమలకు పాదయాత్రగా వస్తామని వారు ఎన్నికలకు ముందు మొక్కుకున్నారు. ఇప్పుడు మొక్కు తీర్చుకోవడానికి శనివారం బయలుదేరారు. స్థానిక పాపాగ్ని నది పరివాహక ప్రాంతంలోని అంజనేయస్వామికి ప్రత్యేక పూజలుచేసి, పాదయాత్ర మొదలుపెట్టారు. కార్యక్రమంలో సభ్యులు సోమరాయల్, వినోద్‌నాయక్, జయచంద్ర, సాంబశివ తదితరులు ఉన్నారు.

గాలివానకు నేలకొరిగిన భారీ వృక్షం


పాఠశాల వద్ద నేలకొరిగిన చెట్టు

తనకల్లు, జూన్ 8: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల వద్ద గల భారీ వృక్షం శుక్రవారం రాత్రి గాలివానకు నేలకొరిగింది. చెట్టు రోడ్డుకు అడ్డుగా పడింది. విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఆ చెట్టును తొలగించి రహదారిలో రాకపోకల సౌకర్యం కల్పించారు.


ఆలయంలో న్యాయాధికారి, కుటుంబ సభ్యులు

ఆంజనేయస్వామి సన్నిధిలో విశాఖ న్యాయాధికారి

నల్లచెరువు, జూన్ 8: మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయాన్ని విశాఖపట్నం సివిల్ కోర్టు సీనియర్ న్యాయాధికారి వెంకటేశ్వర రావు శనివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు వారికి ఘన స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి ఆయన్ని శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. గతంలో కదిరి కోర్టులో పని చేసినట్లు ఆయన తెలిపారు. భక్తులు కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

'విద్యాకానుక' పై సమగ్ర విచారణ చేయాలి

అనంతపురం విద్య, జూన్ 8 : పాఠశాలలకు ఈ ఏడాది సరఫరా చేసే విద్యాకానుక కిట్లలో రూ. 150 కోట్ల దోపిడీ జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని, దీనిపై సమగ్రమైన విచారణ చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కానుక కిట్లను టెండర్ నిర్వహించకుండానే కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్ధతిలో రూ. 772 కోట్ల సామాగ్రిని సరఫరా చేసే బాధ్యతలు అప్పగించారన్నారు. దీన్ని ప్రజాసంఘాల నాయకులు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. విద్యార్థుల సంఖ్యకంటే అదనంగా 9.31 లక్షల మందికి కిట్లు కొనుగోలు చేసినట్లు విమర్శలు వస్తున్నాయన్నారు. నోట్ పుస్తకాల్లో నాణ్యత లోపించడం, 2023-24 విద్యా ఏడాదిలో సరఫరా చేసిన బ్యాగులు నాణ్యత లేవదన్న ఆరోపణలు వచ్చాయన్నారు.

పుస్తక పరిచయ సభను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జూన్ 8: జిల్లా రచయితల సంఘం(జిరసం) ఆధ్వర్యంలో పుస్తక పరిచయ సభను నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించనున్న సభకు సాహితీవేత్తలు విశేషంగా హాజరై జయప్రదం చేయాలని జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి ముఖ్యఅతిథిగా హాజరై కవి సిద్దగిరి శ్రీనివాసులు రచించిన 'నొళంబవాడి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.40వేలు

అనంతపురం రూరల్, జూన్ 8: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.40వేలు, కనిష్ఠంగా రూ.16వేలు, సరాసరి రూ.26వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మొత్తంగా 760టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రియల్ ఎస్టేట్ కుదేలు


చిగిచెర్లకు వెళ్లే రహదారి పక్కన బడన్నపల్లి వద్ద వేసిన లే అవుట్

● కొత్త ప్రభుత్వంలో మంచిరోజులు వచ్చేనా...? ● జాతీయ రహదారులతో పెరిగిన ధరలు

ధర్మవరం, జూన్ 8: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలయింది. జిల్లాల ఏర్పాటుతో పుంజుకుంటుందన్న ఆశతో కోట్లాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన వారు వడ్డీలు కూడా కట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2022లో అనంతపురం జిల్లాను విభజించి కొత్తగా సత్యసాయి జిల్లాను ఏర్పాటు చేసింది. జిల్లా ఏర్పాటవుతుందని వార్తలు రావడంతో సత్యసాయి జిల్లా వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంది. ఈ క్రమంలో సత్యసాయి జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల ప్రాంతాల భూములకు రెక్కలొచ్చాయి. ముఖ్యంగా జగరాసుపల్లి, కప్పలబండ, మామిళ్లకుంట, జానకంపల్లితో పాటు కొత్తచెరువు మండల పరిసరాల్లో భూములు ఎకరా రూ.2కోట్ల నుంచి రూ.3కోట్లు పలికాయి. దీంతో ఆ భూముల రైతులు ఆనందపడ్డారు. ఈ ఆనందం మూణ్నాళ్ల ముచ్చటగా ముగిసిపోయింది. జిల్లా కార్యాలయాలకే భవనాలు లేనప్పుడు జిల్లా కేంద్రాన్ని ఎక్కడ నిర్వహిస్తారోనన్న సందేహం మొదలైంది. సత్యసాయి జిల్లా ఏర్పాటుతో భూములు కొనుగోలు చేసిన వారు లాభాలు రావడంతో కొందరు వెంటనే క్రయవిక్రయాలు జరిపారు. ఇంకా కోట్లలో డబ్బు వస్తుందని ఆశపడ్డ వారికి నిరాశేఎదురైంది. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు రియల్‌ఎస్టేట్ చేసేవారి నుంచి మామూళ్లు ఇవ్వాలని పట్టుపట్టడంతో వ్యాపారులు కనుమరుగయ్యారు. దీంతో ఐదేళ్ల వైసీపీ పాలనలో రియల్‌ఎస్టేట్ రంగం చతికిలపడింది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. సత్యసాయి జిల్లాలో ముదిగుబ్బ నుంచి కోడూరు చెక్ పోస్టు వరకు నాలుగు రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. బత్తలపల్లి నుంచి చెన్నై వరకు జాతీయ రహదారుల విస్తరణ కార్యక్రమాన్ని శ్రీకారంచుట్టింది. ఉమ్మడి జిల్లా నుంచి రాజధాని అమరావతికి జాతీయ రహదారి నిర్మాణానికి శ్రీకారంచుట్టడం, సత్యసాయిజిల్లాలోని కొత్తచెరువు మండల సమీపంలో రైల్వే జంక్షన్‌కు సర్వే నిర్వహించడంతో ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయి. కొత్తచెరువు మండల కేంద్రంలో ఎకరా రూ.2కోట్ల నుంచి రూ.3కోట్ల వరకు ధరలు పలుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో కోట్లాదిరూపాయలతో భూములను కొనుగోలు చేసి, వాటిని కొనేవారు లేక పూర్తిగా నష్టపోయామని పలువురు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. ధర్మవరం సమీపంలోని పుట్టపర్తి రహదారి, చిగిచెర్ల, బత్తలపల్లి రహదారి, ఎస్‌ఎస్‌గేటు రహదారుల్లో కూడా భూములు కొనుగోలు చేశారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు కాబోతుండటంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


పుట్టపర్తి ప్రాంతంలో వేసిన వెంచర్

అప్పులుచేసి భూములు కొన్నా

: మల్లెల నారాయణస్వామి, ముదిగుబ్బ


వైసీపీ ప్రభుత్వ హయాంలో 10 ఎకరాలు రూ.60లక్షలతో కొనుగోలు చేశాను. భూములు కొనుగోలు చేసిన కొద్దిరోజులకే రియల్ ఎస్టేట్ కుదేలైంది. భూములు కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. భూముల కొనుగోలు చేయడానికి అప్పులు చేశా. వడ్డీలు కట్టడానికే ఇబ్బందులుపడుతున్నా. కొత్త ప్రభుత్వంలోనైనా రియల్‌ఎస్టేట్‌కు మంచి రోజులు వస్తే బయటపడతా.

రియల్‌ఎస్టేట్‌కు రిజిస్ట్రేషన్ చార్జీలు శాపం

: రమేశ్‌బాబు, రియల్ వ్యాపారి, కొత్తచెరువు



గత ప్రభుత్వాల హయాంలో రియల్‌ఎస్టేట్ రంగం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగేది. వైసీపీ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్‌రంగంపై ప్రజాప్రతినిధులకు మామూళ్లతో పాటు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం వల్ల భారం పడింది. ప్లాట్లు కొనుగోలు చేసేవారిపై భారం పడుతుండటంతో స్థలాలు కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు.

ఇక మంచిరోజులు వస్తాయి

: మారుతీరెడ్డి, పుట్టపర్తి


కొత్త ప్రభుత్వంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి మంచిరోజులు వస్తాయన్న నమ్మకం ఉంది. గత ప్రభుత్వంలో రెండు ఎకరాల భూమి కొనుగోలు చేశా. ఇంతవరకు ఆ భూమి కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో భూమి కొనుగోలుకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టా. కొత్త ప్రభుత్వంలో రియల్‌ఎస్టేట్‌కు మంచిరోజులు వస్తాయి, మా కష్టాలు తీరుతాయి.


నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటైన ఓ వెంచర్



చెక్‌ధ్వాం..!

ధ్వంసమైన చెక్‌డ్యాంలు...

• రాళ్లు తేలి.. ముళ్ల పొదలతో నిండిపోయాయి
• అడుగంటుతున్న భూగర్భ జలాలు...
• వైసీపీ పాలనలో మరమ్మతులు మరిచారు


శింగనమలలో పాడైపోయిన చెక్‌డ్యామ్

శింగనమల జూన్8: భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా టీడీపీ హయాంలో నిర్మించిన చెక్‌డ్యాంలు ధ్వంసమైపోతున్నాయి. నియోజకవర్గంలో వాటర్‌షెడ్ నీటి యాజమాన్య ఆధ్వర్యంలో వీటిని నిర్మించారు. వేసవిలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో భూగర్భ జలాలు పెంపొందించి రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా డ్వామా ఆధ్వర్యంలో మండలంలోని పలు ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు నిర్మించారు. శింగనమల మండలంలో 89 చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో పాటు మండలంలోని 10 కుంటలకు రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. దీంతో వర్షాధారం కింద నీరు నిల్వ ఉండి, భూగర్భ జలాలు పెరిగి మండలంలో వందలాది ఎకరాలలో రైతులు పంటలు సాగు చేసిన సందర్భాలూ ఉన్నాయి. మూగజీవాలకు తాగునీటి సమస్య కూడా పరిష్కారమయ్యింది. బోర్లలో జలాలు పెరిగేవని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

● వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి తరువాత చెక్‌డ్యామ్‌లు, కుంటలు, చెరువుల మరమ్మతులను గాలికొదిలేశారు. వాటిలో పూడిక చేరి ముళ్లపొదలతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. చాలా చెక్‌డ్యాంలు రంధ్రాలు పడి, రాళ్లు కొట్టుకుపోవడంతో శిథిలావస్థలోకి చేరాయి. రాళ్లు ఊడిపోయి ధ్వంసమయ్యాయి. పలు చోట్ల రాళ్లు తొలగిపోయి ముళ్లపొదలు పెరిగాయి. దీంతో వర్షం వచ్చినా చుక్క నీరు నిల్వ ఉండడం లేదు. దీంతో గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటిపోయి తాగు, సాగు నీటికి తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా డ్వామా అధికారులు చెక్‌డ్యాంల మరమ్మతులపై దృష్టి సారించి భూగర్భజలాలను కాపాడాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి: నెట్టికంటి, రైతు


సీ.బండమీదపల్లి గ్రామంలో టీడీపీ హయాంలో 10 చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. అప్పట్లో వేసవికాలంలో బోర్లు ఎండిపోయినా భూగర్భజలాలు పెరిగి పొలాలు సాగు చేసేవారం. ఇప్పుడు చెక్‌డ్యాంలో చుక్క నీరూ నిలవడం లేదు. మరమ్మతులు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

వేసవిలో ఎంతో ఉపయుక్తం..


టీడీపీ హయాంలో శింగనమలలో దాదాపు 15 చెక్‌డ్యామ్‌లు రాతికట్టడాలతో పకడ్బందీగా నిర్మించారు. వర్షాకాలంలో నీరు పుష్కలంగా చేరి కళకళలాడేవి. అవే నీటిని ఎండాకాలంలో వాడుకునేవాళ్లం. వైసీపీ ప్రభుత్వంలో వాటర్‌షెడ్ పనులకు స్వస్తి పలకడంతో చెక్‌డ్యాంలు శిథిలావస్థకు చేరుకున్నాయి. భూగర్భజలాలు తగ్గిపోయి నీటికి తిప్పలు తప్పడం లేదు.

- పెద్దనాగముని, వాటర్‌షెడ్ మాజీ డైరెక్టర్

గొర్రెలకూ నీటి కష్టాలే : కాపరి బొజ్జప్ప


కొండ ప్రాంతాల్లో నిర్మించిన చెక్‌డ్యామ్‌లతో మూగజీవాల దాహం తీరేది. ఇప్పుడు పూర్తిగా ధ్వంసం కావడంతో నీరు నిల్వ లేక గొర్రెలకు తాగునీరూ దొరకడం లేదు. ముళ్లపొదలు, ఎక్కడ చూసినా రంధ్రాలతో నీరు లీక్ అవుతోంది. వర్షాలు కురిసినా నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదు. కనీసం మూగ జీవాల కోసమైనా వాటికి మరమ్మతులు చేయించి నీటిని నిల్వ ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

13న చైతన్యజ్యోతి మ్యూజియం పునఃప్రారంభం


చైతన్యజ్యోతి మూజియం

పుట్టపర్తి, జూన్ 8: పట్టణంలోని సత్యసాయి సెంట్రల్ ట్రస్టుకు సంబంధించిన చైతన్య జ్యోతి మ్యూజియంను కొద్దిరోజుల క్రితం మూసేశారు. లోపలిభాగంలో పలు మరమ్మతులు చేపట్టనున్న కారణంగా మూసివేయాల్సి వచ్చిందని ట్రస్టువర్గాలు శనివారం తెలిపాయి. తిరిగి ఈనెల 13వ తేదీన పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి 11:30గంటల వరకు, తిరిగి సాయంత్రం 3 నుంచి 5గంటల వరకు మ్యూజియంను సందర్శించడానికి సందర్శకులను లోనికి అనుమతిస్తామని పేర్కొన్నాయి.

టిప్పర్ ఢీకొని జీవిత ఖైదీ మృతి


ఉప్పర ఈరన్న (ఫైల్)

బుక్కరాయసముద్రం, జూన్ 8: అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు వద్ద శనివారం టిప్పర్ ఢీకొని జీవిత ఖైదీ ఉప్పర ఈరన్న (50) మృతి చెందారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన ఈరన్న 2005లో తన భార్యను హత్య చేసిన కేసులో ముద్దాయి. కోర్టులో నేరం రుజువు కావడంతో 2007లో జీవిత ఖైదు పడింది. కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూ.. సత్ప్రవర్తన కారణంగా 2016లో అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలుకు వచ్చాడు. జైలుకు సంబంధించి వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసేందుకు సైకిల్ మీద వెళుతుండగా వేగంగా వచ్చిన ఓ టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఈరన్న అక్కడిక్కడే మృతి చెందాడు. ఈరన్న 17 సంవత్సరాల నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. కొత్త ప్రభుత్వంలో క్షమాభిక్షపై విడుదల అవుతానని తోటి ఖైదీలతో తరుచూ అనేవాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. ఈరన్న మృతితో ఓపెన్ ఎయిర్ జైలులో విషాదం నెలకొంది. ప్రమాదానికి కారణమైన ట్రిప్పర్ అనంతపురం నగరానికి చెందిన ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీది అని జైలు అధికారులు తెలిపారు. బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఓపెన్ ఎయిర్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ షఫివుర్ రెహమాన్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ పరిశీలనకు జాంబియా బృందం

అనంతపురం అర్బన్, జూన్ 8: ఉమ్మడి జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగవుతున్న పంటలను పరిశీలించేందుకు 16 మంది సభ్యులతో కూడిన జాంబియా బృందం వచ్చింది. జాంబియా దేశ వ్యవసాయ మంత్రిత్వ శాఖకు చెందిన ప్రతినిధి సయామీస్ ముండియా, వ్యవసాయ కళాశాలకు చెందిన ఇద్దరు శిక్షణాధికారులు, కేఏటీసీ ప్రతినిధి క్లాస్ రెక్టేన్వాల్డ్‌తోపాటు మరో 11 మంది రైతులు, వాల్పోనాస్కా శిక్షణా క్షేత్రం(వీఎల్‌ఎఫ్) ప్రతినిధులు జిల్లాకు వచ్చారు. శనివారం అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నేవేటీవ్ ఆఫీసర్ లక్ష్మానాయక్, అధికారులు, సిబ్బంది జాంబియా బృందం సభ్యులు సమావేశమయ్యారు. ఉమ్మడి అనంత జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే పంటలు, సాగు చేసే విధానం, పంటల వారిగా అయ్యే ఖర్చు తదితర వివరాలపై జాంబియా బృందం ఆరా తీసింది. సోమవారం నుంచి ఈనెల 21వతేదీ ఉమ్మడి అనంత జిల్లాలోని వివిధ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జాంబియా బృందం పరిశీలించనుంది. సోమవారం బత్తలపల్లిలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బృందం పరిశీలించనుంది. ఆ తర్వాత షెడ్యూల్ మేరకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే పంటలను పరిశీలించి, ఆయా రైతులతో ముఖాముఖిగా మాట్లాడి ప్రకృతి వ్యవసాయంపై అధ్యయం చేయనున్నారు. జాంబియాలోని లుసాకాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి లాభాపేక్ష లేకుండా సుస్థిర ఆర్గానిక్ వ్యవసాయం చేయించి, ప్రజల జీవనోపాధులు పెంచాలన్న ఉద్దేశ్యంతో జాంబియా బృందం జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు విధానంపై అధ్యయనం చేసేందుకు వచ్చినట్లు సంబంధిత శాఖాధికారులు పేర్కొన్నారు.


జిల్లా అధికారులతో సమావేశమైన జాంబియా బృందం

పూలే, అంబేడ్కర్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జూన్ 8 : మహాత్మా జ్యోతిరావుపూలే, బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారాలకు అర్హులైన, ఔత్సాహికులైన విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులు పంపాలని రిజర్వేషన్ల ఎంప్లాయీస్ ఫెడరేషన్, మహాత్మాజ్యోతిరావు పూలే ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు. శనివారం ఉపాధ్యాయ భవన్‌లో ఆయా సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు నారాయణ నాయక్ మాట్లాడుతూ..... ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివిన అన్ని కులాల మహిళా విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులన్నారు. 10వ తరగతిలో 450 మార్కులు, ఇంటర్‌లో 750 మార్కులు, ఆపైన సాధించిన విద్యార్థులు తమ మార్కుల జాబితా, ఆధార్‌కార్డులను వాట్సప్‌కు పంపాలన్నారు. పుల్లయ్య 9966807021, నాగభూషణం 8309475846, నారాయణనాయక్ 9494933825, ఓబులేసు 9441443923 నెంబర్లకు పంపాలన్నారు. ఈనెల 25వ తేదీలోగా పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శ్రీనివాసులు, ఓబులేసు, రాజశేఖర్, శ్రీరాములు, శివయ్య, మల్లికార్జున, మహేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంఘాల నాయకులు

26 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 8 : జిల్లాలోని 26 మండలాల్లో శుక్రవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా పెద్దవడుగూరులో 64.4 మి.మీ వర్షపాతం నమోదైంది. అనంతపురం 29.2, కళ్యాణదుర్గం 27.2, ఆత్మకూరు 24.0 , బ్రహ్మసముద్రం 21.0, బుక్కరాయసముద్రం 19.2, కుందుర్పి 18.2, కంబదూరు 17.2, శింగనమల 17.0, రాప్తాడు 16.0 మి.మీల వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 13.2 మి.మీలోపు వర్షపాతం నమోదైంది. అలాగే శనివారం బెలుగుప్ప, గార్లదిన్నె, పామిడి మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. అనంతపురంలో చిరుజల్లులు పడ్డాయి. పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. వాగుల్లోకి నీరు చేరి పొంగిపొర్లుతన్నాయి.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రామోజీ మృతికి నాయకుల సంతాపం



మంగళగిరిలో రామోజీకి నివాళి అర్పిస్తున్న రాజు

మడకశిర టౌన్, జూన్ 8: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మరణం తెలుగు సమాజానికి తీరని లోటని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. జనహితమే తన అభిమతంగా నిబద్ధతతో పనిచేసిన రామోజీరావు మరణం బాధాకరమన్నారు. విజయవాడ మంగళగిరి టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి వారు నివాళులు అర్పించారు.



పెనుకొండలో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్: రామోజీరావు మృతికి సంతాపం తెలుపుతూ ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శనివారం రామోజీరావు అనారోగ్యంతో చికిత్సపొందుతూ మృతిచెందారు. పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో, సోమందేపల్లి టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. పెనుకొండ మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, మాధవనాయుడు, కేశవయ్య, సర్పంచ్ శ్రీనివాసులు, వాసుదేవరెడ్డి, బాబుల్‌రెడ్డి, వెంకటగిరిపాళ్యం శీన, నీరుగంటి చంద్ర, సిద్దలింగప్ప, కిష్ట పాల్గొన్నారు.



మడకశిర రూరల్: రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతి తెలుగు సమాజానికి తీరనిలోటని టీడీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



హిందూపురంలో రామోజీరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

హిందూపురం: రొద్దంలో రామోజీరావు మరణానికి టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, పెనుకొండ నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు చిన్నప్పయ్య, నాయకులు వీరాంజనేయులు, వాల్మీకి చంద్రశేఖర్, హరీష్, పెనుకొండ మండలం రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు, మావటూరు గోపాల్, తదితరులు పాల్గొని ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

మారెమ్మ ఆలయంలో హుండీ చోరీ

పావగడ, జూన్ 8: పట్టణానికి సమీపంలో ఉన్న పావగడ రొప్పం కంబదూరు మారెమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీని పగలకొట్టి నగదు, వెండి, బంగారు ఆభరణాలను దొంగలించుకెళ్లినట్లు ఆలయ అర్చకుడు శంకర్‌నాయక్ తెలిపారు. రూ.3లక్షలకుపైగా ఆభరణాల విలువ ఉంటుందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక పాడి రైతులు దేశానికే ఆదర్శం



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పావగడ, జూన్ 8: కర్ణాటక పాడి రైతులు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే వెంకటేశ్ అన్నారు. శనివారం సీకేపురం గ్రామంలో పాల ఉత్పాదకుల మహిళా సహకార సంఘాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. తుమకూరు జిల్లా కర్ణాటక పాల ఉత్పాదనలో మొదటిస్థానంలో ఉందని, రాష్ట్రం దేశంలోనే పాల ఉత్పత్తిలో మొదటి స్థానం పొందిందన్నారు. వీటంతటికి రైతులే ప్రధాన కారణమని కొనియాడారు. ఇదివరకు పురుష సంఘాలు ఏర్పాటు ఉండగా, నేడు మహిళలు కూడా పాల ఉత్పాదన సంఘం ఏర్పాటు చేసి మహిళా సఫలీకరణకు ముందడుగు వేయడం గర్వకారణమని మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడు ఆనంద్‌రావు, కోటే ప్రభాకర్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండలపూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

హిందూపురం అర్బన్, జూన్ 8: పట్టణంలోని శ్రీకంఠపురం అయ్యప్ప దేవాలయంలో శనివారం మండల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప ఆలయాన్ని నూతనంగా నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ చేసి 40 రోజులు అయిన సందర్భంగా మండలపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహ హోమాలు నిర్వహించారు. మూల విరాట్‌ను పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జె.వి. అనిల్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకుడు పార్థసారథి, వరప్రసాద్, తిరుమలేష్, బద్రీ, శాంతరాజు, గురుస్వాములు లింగప్ప, నాగరాజు, అశ్వత్థనారాయణ, రైల్వేచంద్ర, సుబ్రహ్మణ్యం, ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రాకారోత్సవం

హిందూపురం అర్బన్, జూన్ 8: పట్టణంలోని పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం ప్రాకారోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే ఆలయంలో మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు అర్చనలు నిర్వహించి పూలు నగలతో అంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగనంలో ప్రాకారోత్సవం గావించారు. గోవింద నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.



ప్రాకారోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

కండువా మార్చేద్దాం..!

- కుర్చీ మడత పెట్టేద్దాం...
- వైసీపీని వీడేందుకు మున్సిపల్ కౌన్సిలర్లు సిద్ధం
- కొందరిని వ్యతిరేకిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, జూన్ 8: సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసి కోలుకోలేనంతగా వైసీపీ ఇబ్బందుల్లో పడింది. ఆ పార్టీ నేతలు, శ్రేణుల్లో అప్పుడే లుకలుకలు మొదలయ్యాయి. కొంతమంది నేరుగా అధిష్ఠానాన్నే తప్పు పడుతుండగా ఆయా నియోజకవర్గాల బాధ్యులను తిట్టిపోస్తున్నారు. మరికొందరైతే ఏకంగా కండువా మార్చేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో హిందూపురం మున్సిపాలిటీ రాజకీయ ముఖ చిత్రం త్వరలో మారబోతుందా అంటే, అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పట్టణలోట దీనిపైనే ఎక్కడచూసినా చర్చించుకుంటున్నారు. పట్టణంలో 38 వార్డులుండగా 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 29 మంది వైసీపీ కౌన్సిలర్లు గెలుపొందారు. ఆరుగురు టీడీపీ, ఎంఐఎం, బీజేపీ, స్వతంత్రులు ఒక్కొక్కరు గెలిచారు. అయితే స్వతంత్ర అభ్యర్థులు వైసీపీవారు కావడంతో ఆ పార్టీలో చేరిపోయారు. దీంతో వారి సంఖ్య 30కి చేరింది. సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీ నుంచి ఇద్దరు, ఎంఐఎం నుంచి ఒకరు టీడీపీలో చేరారు. ప్రస్తుతం టీడీపీ బలం తొమ్మిదికి చేరింది. దీనికితోడు బీజేపీ కౌన్సిలర్ ఒకరున్నారు. వీరితో కలుపుకుంటే పది మంది అవుతారు. చైర్మన్ కావాలంటే 20మంది అవసరం.

వైసీపీని వీడే యోచన

సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ తుడిచిపెట్టుకుపోవడం టీడీపీ క్లీన్‌స్వీప్ చేయడంతో మొన్నటి వరకు అధికార పార్టీలో ఉన్న వైసీపీ కౌన్సిలర్లు కొంతమంది ఎలాగైనా కండువా మార్చేద్దామని తన సన్నిహితులవద్ద చెప్పుకుంటున్నారు. ఈనేపథ్యంలో కొంతమంది కౌన్సిలర్లు పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ తరుణంలోనే కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు కలిసి వైసీపీకి గుడ్‌బై చెప్పేసి టీడీపీలో చేరుదామని లేదంటే వార్డుల్లో తిరగలేమని ఆలోచనలో పడ్డారు. ఇందులో ప్రజాప్రతినిధి కూడా ఉన్నట్లు సమాచారం. ప్రజాప్రతినిధి తరలిరావడానికి కారణమైన మాజీ ప్రజాప్రతినిధి ఇప్పటికే టీడీపీలో చేరడంతో మార్గం సుగమం అవుతుందని చర్చించుకుంటున్నారు. వీరితోపాటు మరో 15 మంది కౌన్సిలర్లు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.



వారు వద్దే వద్దు..

ఐదేళ్ల వైసీపీ పాలనలో కొంతమంది కౌన్సిలర్లు అత్యుత్సాహం ప్రదర్శించి ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను తీవ్రంగా విమర్శించారు. కొంతమందైతే ఎమ్మెల్యేపై వ్యక్తిగత దూషణలు కూడా చేశారు. సోషల్ మీడియాలో టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా పోస్టులు పెట్టారు. అలాంటి కౌన్సిలర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ టీడీపీలోకి తీసుకోకూడదని గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. మరికొంతమందైతే కౌన్సిలర్లు వస్తే టీడీపీ చైర్మన్ కావచ్చని భావిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఆరేడుమంది సభ్యులను ఎట్టి పరిస్థితుల్లోనూ టీడీపీలోకి చేర్చుకోనీయకూడదని గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. వారిని టీడీపీలోకి తీసుకుంటే మేము అవసరమైతే పార్టీకి దూరంగా ఉంటామని బహిరంగంగా వ్యతిరేకిస్తున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే టీడీపీలో ఉన్న ఒకరిద్దరు కౌన్సిలర్లు వైసీపీ సభ్యులను చేర్చుకుంటే ఆఖరి ఏడాది తెలుగుదేశం పార్టీకి చెందినవారు చైర్మన్ కావచ్చని భావిస్తున్నారు. ఎందుకంటే మునిసిపల్ చైర్మన్‌ను మార్చాలంటే ఎన్నుకున్న నాలుగేళ్ల మార్చడం సాధ్యం కాదు. దీంతో ప్రస్తుతం ఉన్న చైర్మన్ వచ్చేయేడాది మార్చినాటికి నాలుగేళ్లు పూర్తవుతుంది. ఆఖరి యేడాది టీడీపీ వారికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

మారనున్న ముఖచిత్రం

ఒకవేళ కౌన్సిలర్లు టీడీపీలో చేరితే హిందూపురం మునిసిపాలిటీ ముఖచిత్రం మారనుంది. ఎందుకంటే గతంలో ఎన్నడూ లేనివిధంగా మెజార్టీ కౌన్సిలర్లు ఉండి కూడా మరోపార్టీలో చేరి ఆ పార్టీ తరుపున చైర్మన్ అయితే అది హిందూపురం మునిసిపాలిటీ విచిత్రమవుతుంది. అంతేకాక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కావడంతో ఇదో రికార్డుగా నిలవనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రహస్య మంతనాలు షురూ..!

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి తరువాత ఆ పార్టీకి చెందిన మరికొందరు కౌన్సిలర్లు, నాయకులు కండువాలు మార్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో టీడీపీ నాయకులు రహస్య మంతనాలు సాగిస్తున్నట్లు సమాచారం. వీటన్నింటిపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

కార్డుదారులకు అందని రేషన్

- డీలర్‌తో గొడవకు దిగిన లబ్ధిదారులు

గుడిబండ, జూన్ 8: రేషన్ కార్డుదారులు గంటల తరబడి వేచి చూసినా బియ్యం మాత్రం అందలేదు. దీంతో వారు డీలర్లతో వాగ్వాదానికి దిగారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... గుడిబండ మండలం ఎస్. రాయాపురం గ్రామంలో 22, 23 రేషన్ షాపులున్నాయి. నాలుగు రోజుల క్రితం చౌకధాన్యపు డిపోడీలర్, ఎండీయూ ఆపరేటర్ కలిసి రేషన్ బియ్యాన్ని వాటర్‌ట్యాంక్ రూమ్ వద్ద పంపిణీ చేశారు. అయితే పూజారిపల్లి 21వ షాపులో 480 రేషన్‌కార్డులు ఉండగా బఫర్‌స్టాక్ ఉండటంతో మేకలగట్ట, పూజారిపల్లి గ్రామస్థులు ఎస్.రాయాపురం 23వ షాపునకు వచ్చి బియ్యాన్ని తీసుకెళ్లారు. ఎస్.రాయాపురం గ్రామంలో 400కుపైగా రేషణ్‌కార్డులు ఉన్నాయి. 22వ షాపులో శనివారం పంపిణీ చేస్తామని చౌకధాన్యపు డిపో డీలరు తెలియజేయడంతో గ్రామంలోని రేషన్‌కార్డుదారులు ఉదయం 6గంటలకే పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఉదయం నుంచి బియ్యం కోసం బారులుతీరారు. రేషన్‌బియ్యం అయిపోవడంతో వందల మంది లబ్ధిదారులు ఇళ్లకు వెళ్లాల్సివచ్చింది. బియ్యం కోసం వేచివున్నా స్టాక్ అయిపోయిందని డీలర్ చెప్పడంతో లబ్ధిదారులు గొడవకు దిగారు. అయితే బియ్యం లేవని డీలర్, ఎండీయ ఆపరేటర్ చేతులేత్తేశారు. వారిద్దరు కుమ్మక్కై బియ్యం స్వాహా చేశారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. స్టాక్‌పాయింట్ నుంచి తక్కువ బియ్యం రేషన్‌షాపులకు చేరడంతో కొంత మందికి మాత్రమే అందాయి. మిగిలినవారికి బి య్యం అందలేదు. రెవెన్యూశాఖ అధికారులు స్పందించి బియ్యం అందని లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరుతున్నారు. దీనిపై పుట్టపర్తి డీఎస్‌ఓ కార్యాలయం సీఎస్‌డీటీ అధికారిణి విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా బియ్యం అందలేదని తన దృష్టికి వచ్చిందని, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.



ఎస్.రాయాపురంలో రేషన్ బియ్యం కోసం వేచి ఉన్న మహిళలు

నందమూరి ఆశయ సాధనకు కృషిచేద్దాం

అగళి, జూన్ 8: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జడ్పీటీసీ ఉమేష్ అన్నారు. మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహం 60రోజులుగా ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో మూసివేశారు. కోడ్ ముగిసిన అనంతరం శనివారం విగ్రహానికి ముసుగు తొలగించి మొదట నీటితో కడిగి అనంతరం పాలాభిషేకం చేశారు. ఉమేష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషిచేశారన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులుఅర్పించారు. కన్వీనర్ కుమారస్వామి, లింగరాజు, రంగనాథ్, మాజీ కన్వీనర్ షౌకత్ అలీఖాన్, రాజన్న, కర్రియన్న, నాగరాజు, మారుతి, నాగప్ప, మాజీ సర్పంచ్ లింగన్న, గోవిందప్ప, దినేష్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

మడకశిర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

మడకశిర రూరల్, జూన్ 8: నియోజకవర్గ అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు భక్తార్‌సాబ్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేయడానికి జాతీయ రహదారి ఉన్నతాధికారులతో చర్చించి రూ.15 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీకి పట్టణంలో అత్యధిక మెజార్టీ ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్లు ఉమాశంకర్, శ్రీనివాసులు, రాజా, హనుమంతు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

దాతల సేవలు వృథా

- మూలనపడిన ఉపకరణాలు
- రోగులకు తప్పని తిప్పలు

హిందూపురం అర్బన్, జూన్ 8: ప్రజల సౌకర్యార్థం హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో దాతలు ఏర్పాటు చేసిన పలు ఉపకరణాలు నిరుపయోగంగా మారాయి. ఆసుపత్రిలో రోగులకు తాగునీరు అందడం లేదని తెలుసుకొని కొంత మంది దాతలు స్పందించి మాతాశిశు కేంద్రం వద్ద తాగునీరు అందించే వాటర్ ఫిల్టర్లను అందించారు. దీంతో ఆసుపత్రిలో తాగునీటి సమస్య తీరింది. అయితే వాటర్ ఫిల్టర్లు ఏమయ్యాయో తెలియదు కాని రోగులకు తాగునీరు అందడం లేదు. దీంతో రోగులు బయట నుంచి నీటిని కొనుక్కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కరోనా సమయంలో ప్రస్తుత అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ స్పందించి గర్భిణులకు వేడినీటిని అందించే గీజర్‌లు ఏర్పాటు చేయించారు. అయితే అవి కూడా పనిచేయలేదని తెలిసింది. దీంతో గర్భిణులు వేడి నీటిని బయటి నుంచి కొని తెచ్చుకుంటున్నారు. దీంతో దాతల సహకారం వృథాగా మారింది. దాతలు అందించిన ఉపకరాణాలు వృథాగా పడేసినా పట్టించుకునే నాథుడు లేడు. బాధ్యతగా ఉండాల్సిన సూపరింటెండెంట్‌లు వాటిపై శ్రద్ధ చూపడం లేదు. కరోనా సమయం నుంచి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చాలా మంది సూపరింటెండెంట్‌లు మారారు. దాతలు ప్రభుత్వ ఆసుపత్రికి ఏ ఏ ఉపకరణాలు అందించారో వారికి అవగాహన లేకపోయి ఉండవచ్చు. రోగులకు మాత్రం ఇబ్బందికరంగా మారింది. సమస్యపై సూపరింటెండెంట్‌ను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



మాతాశిశు ఆసుపత్రిలో మెట్ల కింద పడేసిన వాటర్ ఫిల్టర్



దాతలు అందించిన వాటర్ ఫిల్టర్‌లు ఇలా...

బైకు, కారు ఢీ.. ఒకరికి గాయాలు



ఆస్పత్రిలో గంగాధర్‌ను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, జూన్ 8: మండలంలోని కియ పరిశ్రమ ఎదురుగా బైకును కారు ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు వడ్డి గంగాధరప్ప తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. కియ ఎస్ఐ రంగడు తెలిపిన మేరకు వెంకటగిరిపాళ్యంకు చెందిన గంగాధరప్ప కుమార్తె వెంకటలక్ష్మి కియ పరిశ్రమలో పనిచేస్తోంది. ఆమెను సాయంత్రం ఇంటికి తీసుకెళ్లేందుకు దుద్దేబండ క్రాస్ నుంచి అమ్మవారిపల్లి వైపు ద్విచక్రవాహనంలో గంగాదరప్ప వెళ్తున్నాడు. కియ పరిశ్రమ వద్దకు రాగానే ఎడమవైపు వెళ్తున్న గంగాదర్‌ను పెనుకొండ నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారు వెనుకవైపు ఢీకొందన్నారు. ప్రమాదంలో గంగాధరప్పకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. ప్రతమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. కారును వెంబడించి చెన్నేకొత్తపల్లివద్ద పట్టుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ కేశవయ్య, శ్రీరాములుయాదవ్, వీజీపాళ్యం శీన పెనుకొండ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుడిని పరామర్శించారు.

మొక్కులు చెల్లించిన టీడీపీ నాయకులు



పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

హిందూపురం, జూన్ 8: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మంచి మెజార్టీ సాధించడంతో స్థానిక ఆ పార్టీ నాయకులు మొక్కులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. రెండోవార్డు చౌడేశ్వరీ కాలనీకి చెందిన బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయుడు, రవిచంద్ర, ప్రసాద్, అంజనేయులు, రవికుమార్ శనివారం అంజనేయస్వామి ఆలయం వద్ద 201 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. తెలుగుదేశం పార్టీకి ప్రజాబలంతోపాటు దైవబలం తోడైందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన అంతానికి ఓటర్లతోపాటు దేవుడు కూడా సహకరించారన్నారు. శ్రీనివాసులు, సూరీ, అనంత, ముని, చైతన్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుంది



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న నాగరాజు

మడకశిర రూరల్, జూన్ 8: కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని కల్లుమర్రి సర్పంచు గంగమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు అన్నారు. మండలంలోని కల్లుమర్రి పంచాయతీ ఎల్లోటి గ్రామంలో టీడీపీ నాయకుడు బీమ్లానాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వారు గ్రామానికి వెళ్లి బీమ్లానాయక్ మృతదేహంపై పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. అంత్యక్రియలకు ఆర్థిక సహాయం చేశారు.

వెంటాడుతున్న విత్తన సమస్య..!

- 2 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగు
- 97,886 క్వింటాళ్ల విత్తనకాయలు కేటాయింపు
- మార్కెట్ ధరకు కొనలేమంటున్న రైతులు
- నిబంధనలు సడలించి పంపిణీ చేయాలి

మడకశిర, జూన్ 8: వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నా రైతులకు విత్తన సమస్య వెంటాడుతోంది. గత సంవత్సరం వర్షాలు లేక దెబ్బతిన్న రైతన్నకు ఈ ఏడాది విత్తన వేరుశనగ లేక పంటలు వేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు రైతన్నలు విత్తనాన్ని సమూకుర్చే పనిలో ఉన్నారు. అయితే బహిరంగ మార్కెట్‌లో ధర పెరిగిపోవడంతో రైతులు కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నిబంధనలు సడలించి సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా ప్రతి ఏడాది వేరుశనగ పంట దెబ్బతిన రైతన్నలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గత సంవత్సర తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ పంట ఎండిపోవడంతో వాటిని పొలాల్లో ఉండగానే తొలగించారు. దీనికి తోడు రబీలో అరకొర నీటికి సాగు చేసిన వేరుశనగ పంట కూడా దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారు. అయితే ఈ ఏడాది ముంగారు వర్షాలు దంచికొడుతున్నాయి. దీంతో రైతులు పొలాలను దుక్కు దున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు. బయట మార్కెట్‌లో ధర అధికంగా ఉండడంతో కొనలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న విత్తన వేరుశనగ మూడు బస్తాలు ఎకరాకు సరిపోతుందని, రెండు మూడు ఎకరాలు ఉన్న రైతులు విత్తనం కోసం ఇబ్బందులు పడతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న వేరుశనగ క్వింటాల్ ధర రూ.5,700, మార్కెట్‌లో రూ.7,200 ధర ఉంది. దీంతో మార్కెట్‌లో విత్తన కాయలు కొనలేక పోతున్నామని రైతులు అంటున్నారు.



ఆర్బీకేలో విత్తనం కోసం వేచి ఉన్న రైతులు (ఫైల్)

రెండు లక్షల హెక్టార్లకు విత్తన కేటాయింపు

జిల్లాలో రెండు లక్షల హెక్టార్ల సాగుకు 97,886 కింటాళ్ల విత్తన వేరుశనగను ప్రభుత్వం కేటాయించింది. శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధికంగా ఖరీఫ్‌లో వేరుశనగ పంటను సాగు చేస్తారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న రైతులు పాడిపరిశ్రమ తరువాత వేరుశనగ సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలో ప్రతి ఏడాది ఖరీఫ్‌లో రెండు లక్షలహెక్టార్లలో వేరుశనగపంటను సాగుచేస్తారు. ప్రతిసారి అప్పులు చేసి పంట సాగు చేయడం, పంట కాస్త ఏదో కారణంగా పంటదెబ్బతిని పూర్తిగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నిబంధనలు సడిలించి రైతుకు అవసరం మేరకు విత్తనం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మార్కెట్‌లో ధర అధికం



ప్రభుత్వం అందిస్తున్న విత్తన వేరుశనగ ఎకరాకు సరిపోతుంది. బయట మార్కెట్‌లో వేరుశనగ క్వింటా రూ.7600 పలుకుతోంది. మూడు ఎకరాల పొలం ఉంది. అందులో వేరుశనగ సాగు చేయడానకి ఎకరాకు 30 కేజీల విత్తనాలు అవసరం . ప్రభుత్వం అందిస్తున్న విత్తనకాయలు ఎకరాకు సరిపోతుంది. రెండు ఎకరాల్లో వేరుశనగ సాగు చేయడానికి మరో 60 కేజీల విత్తనం అవసరం. ప్రభుత్వం నిబంధనలు సడలించి మూడు ఎకరాలకు సరపడా విత్తనకాయలు అందించాలి. - రైతు ఓబన్న, మడకశిర